వల్లంపాటి
వెంకటసుబ్బయ్య

"ఇదంతా మీదయ.....నేను ఎలిమెంటరీ గ్రేడు టీచరుగా వున్నప్పుడు మీరు నాకు... ట్యూషను చెప్పకపోతే నే నీ జన్మలో మెట్రిక్ పాసయేవాణ్ణిగాదు."

"అలా అనకు సూర్యం.....ఇందులో నే చేసిం దేముంది. నువ్వు పరీక్ష కూర్చుంటే...ఏదో నాకు తెలిసింది చెప్పాను. అంతే!"

"మీ రలాగే అంటారు గానీండి. నిజం చెప్పాలంటే నిజంగా నేను మీరు వెలిగించిన దీపం..."

కొత్త హెడ్మాస్టరు వినయానికి టీచర్లంతా ఆశ్చర్యపోయారు. కొందరు తోటి టీచర్నిచూచి ఈర్ష్య కూడా పడ్డారు....కానీ ఆ ఈర్ష్య యెంతో సహజమైంది. జగన్నాథంగారికి పట్టిన అదృష్టం అందరికీ పట్టదు—అదో ఇంద్ర పదవి.

జగన్నాథంగారు ఆలోచనలో పడ్డారు....

అప్పుడు తాను తాళ్లదిన్నెలో పనిచేసేవాడు. ఆ వూళ్లో ఎలిమెంటరీ స్కూలు అప్పుడే ప్రారంభించారు. ఆ బడికి టీచర్లూ, భవనం—విద్యార్థులూ అన్నీ కూడవలసిన హంగులే! తాళ్లదిన్నె యెక్కడో విసిరేసినట్లుగా జిల్లా చివర్నవుంది. దానికితోడు అది మలేరియా ప్రాంతం. మహారణ్యాన్ని కప్పుకున్న తలకోన కొండచరియలదాపులోనే వుంది తాళ్లదిన్నె!....అందువల్ల ఆ బడికి యే టీచర్ని వేసినా వచ్చేవాడుకాదు. కానీ తెగించి వచ్చినవాడు సూర్యం ఒక్కడే! అప్పుడే ట్రెయినింగ్ స్కూలునుంచి వచ్చిన పొంగులో మాంచి హుషారుగా—పాల పొంగులాగా వుండేవాడు. బ్రహ్మచారి కావటంవల్ల భోజనానికి నా నా అవస్థపడేవాడు. కొన్ని దినాలు చెయ్యి కూడా కాల్చుకొ చూశాడు. అయ్యవార్ని చేయబోతే కోతి పిల్లయేది. వంకాయకూరకు కాకరకాయ కూరకు భేదం అట్టే వుండేదికాదు.... ఈ చవి చచ్చిన భోజనంతో జొన్నకర్రలావున్న సూర్యం వరకపుల్లలాగైపోయాడు...... వచ్చిననాడు అతనిలోవున్న ఉత్సాహం చవిటిపర్రలో వాన జల్లులా యింకిపోయింది. దీని జతకు మలేరియా తోడయింది. ఈ రెంటితో మరీ డీలాపడిపోయాడు సూర్యం....

"ఏమిటి మేష్టారూ! ఆలోచిస్తున్నారు ?" హెడ్మాస్టరు సూర్యం పలకరించాడు.

"ఆఁ.....అహఁ.....ఏంలేదు. నువ్వు నేను వెలిగించిన దీపం అంటే ఆలోచిస్తున్నా— అంత పెద్ద మాటలకు తగుతానా అని"

"బహుశా మీరు మరిచిపోయారేమో. అది న్యాయమేలెండి. ఉపకారం చేసినవాళ్లు దాన్ని మనసులో వుంచుకోరు. కానీ ఉపకారం పొందినవాడు చచ్చేదాకా దాన్ని భద్రంగా మనసులో వుంచుకోవాలి....

"మనం అప్పుడు తాళ్లదిన్నెలో పని చేస్తున్నాము. ఏమండీ తాళ్లదిన్నె యెక్కడుందో మీ కెవరికైనా తెలుసా ?" సూర్యం టీచర్లందరివైపూ చూశాడు.

"......"

"తెలీదు! ఎలా తెలుస్తుంది! చిత్తూరు, కడప జిల్లాలకు సరిహద్దుగా తలకోన కొండలున్నాయి. ఆ కొండలకింద—అంటే ఆ అడవుల్లోని పులులూ, చిరతలూ గర్జిస్తే వినబడే దూరంలోవుంది తాళ్లదిన్నె. ఆ వూళ్లోని బడికి బిల్డింగ్ లేదు. బిల్డింగో

ఆ బడికి పిల్లలురారు. ఆ వూళ్లో జీవితం గతి యెలావున్నా—ఆ బళ్లో ఉద్యోగం మాత్రం చెను దారీయే!

ఒకసారి నాకు మలేరియా వచ్చింది. ఎందుకున్నారు? తలకోన కొండల జొకునీళ్ల చూసి క్ష భ్రమించి, వాట్లో స్నానం చేశాను అంతే లేరియా పట్టుకుంది. జ్వరంతో నా చుట్టింట్లో నా అవస్థా పడుతుంటే జగన్నాధంగారు, నన్ను ళ్ళింటికి తీసికెళ్లారు. వారి సపర్యల్తో నాకు ్రరం బాగయింది . . . నేను ఏ ముహూర్తంలో గన్నాధంగారింట్లో అడుగెట్టానోగానీ, తాళ్లదిన్నె దిలేవరకూ—అంటే నాకు పిల్లనిచ్చిన మామ గారు తన కూతురిసుఖంకోసం నన్ను బదిలీ చేయించుకునేదాకా వారి కడప దిగలేదు. అప్పుడు జగన్నాధంగారు ఒకసారి న న్నడిగారు—నువ్వు యెందుకు మెట్రిక్ పరీక్షకు కట్టకూడదూ—అని.

నా తల్లో ఒక్కసారిగా పిడుగుపడింది. లెక్కల్ని తల్చుకుంటే నాకు మరి రెండు జన్మాలపాటు పరీక్షలు వద్దనిపించేది. అంతేగాక, అప్పటికే యధాశక్తి మూడుసార్లు దాడిచేసి వోడిపోయాను. కానీ జగన్నాధంగారి బలం చూసుకుని, భయాన్ని చిన్నింట్లోకితోసి చిలుకేసి ధైర్యంగా నాలుగోసారి — అంటే అప్పటి రూల్సు ప్రకారం చివరిసారి దాడి చేశాను. కిరణభేద్యమైన తాబేలు చిప్పలాంటి మన తలకాయలోకి జగన్నాధంగారు లెక్కల్ని ఎక్కించటానికి పడే శ్రమ చూస్తే ఒక్కోసారి నాకే జాలి ముంచుకొచ్చేది. . . . కానీ మొత్తంమీద వీరు నన్ను మెట్రిక్ — తర్వాత ట్రెయినింగ్ పాసు చేయించారు అంటే నేనే నా శ్రమతో పాసు కాలేదనేగా!" బిగ్గరగా నవ్వాడు సూర్యం.

సభ్యతకోసం టీచర్లంతా నవ్వారు. . . . చీకటి నాలుగు వైపులనుంచీ కలిసికొంటూంది. చిన్న పట్నం అనిపించుకోవటానికి నానా తంటాలూ పడుతున్న ఆ పెద్ద పల్లెలో ఇంకా నవ నాగరికత పిల్లి మొగ్గలు వేయలెదు. పొలాలనుంచీ యిళ్లకొస్తున్న కూలీలు బడిముం దున్న పంట కాలువలో కాళ్లూ చేతులూ కడుక్కుంటున్నారు. ఊళ్లో దీపాలు వెలిగించారు బడిముందరున్న నాగులరాళ్లకట్ట మీదకూచున్న పెద్దమనిషి "భండన భీము డార్తజన బాంధవుడుజ్వల బాణ తూణ కోదండ కళా ప్రపంచ.. "అంటూ పద్యాన్ని ఏలలా లాగుతున్నాడు ..

"భోజనానికి వెడదాంరా సూర్యం" అన్నాడు జగన్నాధంగారు.

"అప్పుడేనా" అన్నాడు సూర్యం.

"అంతేనండీ ఈ వూళ్లో—గూట్లో దీపం, నోట్లో కడి" అన్నాడు లెక్కలటీచరు వెంకటరామయ్య.

"అబ్బ ఎన్ని దినాలకు విన్నానండీ తెలుగు జాతీయం. . . . జగన్నాధంగారూ. . . . భోజనానికి వెళ్దాంరండి"

టీచర్లంతా సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. జగన్నాధంగారు, సూర్యం జగన్నాధంగారింటికి బయలుదేరారు. . . . .

సూర్యం భోజనంచేసి పడుకోవటానికి బడికి వెళ్ళిపోయాక, అనసూయమ్మ భర్తతో అంది—

"చూశారుటండీ! ఆశ్చర్యం! సూర్యం హయరెలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరైపోయాడు"

కోరిక తీరినవేళ

"ఎందుక్కాడు? మెట్రిక్ పాసయాడు ట్రెయినింగ్ పా స యా డు. అ యి నా హెడ్మాస్టరు కావటం యిదేగా మొదటిసారి" అన్నారు జగన్నాధంగారు

"అది సరేలెండి మీరు ప్రెయివేటు చెబితేనేగా ప్యాసయాడు. నే చూశ్లేదేమిటి ఆ సంబడం!"

"అదే వద్దన్నాను సూర్యం తెలివిలేనివాడేం కాడు నేను చెప్పకున్నా పాసయేవాడు"

"ఈ వేదాంతం సరేలెండి—అన్నట్టు మీరూ మెట్రిక్ పాసయారుగా"

"ఆఁ .... అయ్యాను పదిహేనేళ్ల క్రితం ఉండబట్టలేక" "మిగిలిన ట్రైనింగు పరీక్షకు మీరు కట్టగూడదూ" అంది అనసూయమ్మ నడవలో నిద్రపోయిన పిల్లాళ్ళి పడుకోపెడుతూ

ఒకడు తన మిత్రునితో తన ప్రేయసి కేశసౌందర్యం గురించి వర్ణిస్తున్నాడు. "బొగ్గును పోలిన రంగు, సముద్ర కెరటాల్లాంటి వంకీలు, సరిగ్గా 4 అ॥, 5 అం॥ పొడవు."

అయితే వెంటనే ఏదైనా కేశసంహారిణీ సబ్బు వాడి ఆమె తల తీయించేసెయ్. అంతకంటే బట్టతల వుంటే మేలు. హాలి ఉడ్ మోడల్ అనైనా అనుకుంటారు.

పి. ఆనందవర్మ (భీమునిపట్నం)

జవాబుగా జగన్నాధంగారు నవ్వారు

భర్తకేసి ఆశ్చర్యంగా చూసింది అనసూయమ్మ.

"నాకెందుకే పరీక్షలూ—పదవులూను. నా పరీక్షలూ నా బ్రతుకూ సారధితోనే కాలిపోయాయి. మిగులున్న నాలుగేళ్ల సర్వీసూ అలా కళ్ళమూసుకు గడిపేస్తే సరి."

సారధి పేరు అనసూయమ్మ గుండెను ముల్లులా తాకింది.. . ఆనాటికి అనసూయమ్మ వూరుకుంది గానీ ఆ విషయం ఆవిడ మనస్సులో రాజుకుంటూనే ఉంది సూర్యం తన భర్తమీద హెడ్మాస్టరు కావడం ఆవిడ సహించలేకపోయింది. కానీ సూర్యమంటే ఆవిడకు గంపెడంత ప్రేమ దాదాపు పదేళ్ల చేతికందుతున్న కొడుకు—సారధి చేయిజారిపోయాడు దాదాపు ఆ రోజుల్లోనే సూర్యం తాళ్లదిన్నెకు వచ్చాడు. మంచులో తడిసిన మల్లెమొగ్గలా స్వచ్ఛమైన అతని మాటల్లోని అమాయకత్వం, కాటుకపెట్టల్లా ఉన్న కళ్లలో ఎప్పుడూ చిందులాడే ఉత్సాహం, దువ్వెనమీద తిరుగుబాటు చేసి ముఖాన్ని ఆశ్రయించిన క్రాపు—ఇవి ఆనాటి సూర్యం లక్షణాలు. వీటివల్లనే సూర్యంలో సారథి కనిపించాడు అనసూయమ్మకు . ... కానీ సూర్యం మీదున్న మమత, భర్త స్థితి ఆవిడ మనసులో యిప్పుడు ఎట్కు, పడుతున్నాయి.

2

కాలచక్రం దొర్లుతూఉంది. ఒక దీర్ఘమైన సంవత్సరం జగన్నాధంగారి వార్ధక్యంమీద తన ముద్రను వేసి వెళ్లిపోయింది సూర్యం హెడ్మాస్టరుగా ఒక ఇన్క్రిమెంటు కూడా పుచ్చుకున్నాడు .

ఆరునెల్లు దగ్గర పడుతున్నాయి. టీచర్లంతా ఎనిమిదో తరగతికి పాఠాలు పూర్తిచేయాలని స్కూలు తర్వాత క్లాసులు పెట్టుకుంటున్నారు. బడి వదిలినా సూర్యం ఉండమంటే స్కూల్లోనే నిల్చిపోయారు జగన్నాధంగారు. చాలామంది టీచర్లు వెళ్లిపోయారు. తనకు తెలీని ఏదో లెక్క అడిగి చెప్పించుకొంటున్నాడు సూర్యం. ఇంతలో ఒక పిల్లాడు పరుగెత్తుకొచ్చి దారుణమైన వార్త చెప్పాడు. సూర్యం అలాగే క్రుంగిపోయాడు. జగన్నాథంగారి నాడుల్లో ఒక్కసారిగా విద్యుత్తు ప్రవహించింది. అదిరిపడి మళ్లీ ప్రశ్నించాడు.

"ఏమిట్రా . . ఏం పాము ?"

"నాగుపాముటండి"

పరుగుతీశారు యిద్దరూ అప్పుడే జగన్నాథంగారి యిల్లు సంతలా ఉంది. జనాన్ని తోసుకుని లోపలికెళ్లి అనసూయమ్మను చూశారు. అనసూయమ్మను చూడగానే జగన్నాధంగారి మనసులో ఒక సందేహం కలిగింది —అనసూయమ్మ బ్రతికే ఉందా ? చనిపోయిందా ? ... మనసులో కదిలిన యీ సందేహానికి జగన్నాధంగారు వణికిపోయారు . . నాడి చూశారు ఎక్కడో — ఆలోచనకు తగలని పూర్వ స్మృతిలా ఆడుతోంది. జగన్నాధంగారు ఒక్కసారి గాఢంగా నిట్టూర్చారు. ఎదలో ఆశ క్రుంకుతుంటే, భార్యకేసి—పాతిక సంవత్సరాలు తన జీవితంలోని వెలుగునీడల్ని తనతోకూడా పంచుకున్న జీవిత భాగస్వామినికేసి చూశారు. కళ్లలో కనుపాపలు కనబట్టంలేదు. తెల్లగుడ్లే కన్నంతా ఆక్రమించుకుంది. శరీరం కట్టెలాగైపోయింది నోట్లోనుంచి నురగ కారుతోంది ....

అమ్మయ్యగారికి పాము కరిచిందని ఎవరో చెప్పగానె బిగిస్తున్న బండికట్లు అలాగే వదిలేసి వచ్చాడు కరణాల అనంతాచారి. జగన్నాధంగారికి ధైర్యంచెప్పి మంత్రం వేశాడు తర్వాత పది మిరపకాయల్ని నజ్జు గుజ్జుగా దంచి అనసూయమ్మ నోట్లో వేశాడు కానీ ఆవిడలో చలనం అగుపించలేదు మళ్లీ రెండు మూడు సార్లు మంత్రంవేసి చూశాడు కానీ లాభంలేకపోయింది.

"అయ్గారూ ! పామును సంపేశారా !" అనంతాచారి ప్రశ్నించాడు

"తప్పించుకుంది ఆచారీ! వోయబ్బ తెగబారెడుంది." ఎవరో జవాబిచ్చారు.

పాముకు సంబంధించిన వూహ యెదలో కద

లాడి ఒళ్ళు జలదరించింది జగన్నాధంగారికి. అనసూయమ్మకు తెలివి వస్తుందేమోనని అనంతాచారి మరోగంట కూచున్నాడు .. ఈ లోగా చుట్టూరా మూగున్న చాలామంది యిళ్లకు వెళ్లిపోయారు. టీచర్లందరూ కళ్ళలో ప్రాణం ఉంచుకుని నిలబడే ఉన్నారు. జగన్నాధంగారు చీకటి నిండిన మనస్సుతో రాతికూచంలా కూలబడే ఉన్నాడు. వారి ముఖంలో భావాల ద్వంద్వయుద్ధం లేదు వారి ముఖం తుడిచి శుభ్రంచేసిన పలకలా గుంది అద్దమైతే చుట్టూరా ఉన్న అందరి ముఖాల్లోని బాధ ప్రతిఫలించేది ...

"ఎల్తానండీ— అయ్‌గారూ !" అనంతాచారి బయలుదేరాడు.

జగన్నాధంగారిలో చివరిఆశ కూడా అస్తమించింది

అనంతాచారి వెళ్లిపోయాడు.

రాత్రి పదిగంటలైంది.

టీచర్లంతా వెళ్లలేకుండా ఉన్నారు.

అందరి ముఖాల్లోనూ దుఃఖం గూడు కట్టుకుంది.

అనసూయమ్మకు తెలివి రాలేదు- -

జగన్నాధంగారు అక్కడ లేనట్టుగానే వైద్యాలూ, మంత్రాలూ జరుగుతున్నాయి

రాత్రి పన్నెండైంది

టీచర్లంతా దిగాలుపడిపోయారు .... కానీ ... అనసూయమ్మకు తెలివి రాలేదు

గోడ కానుకొని మంత్రముగ్ధుడిలా కూచున్న జగన్నాధంగారు లేచారు ఏమైనా చెబుతారేమోనని సూర్యం ముందు కొచ్చాడు

"మీ రందరూ దయచేసి వెళ్లిపోవాలి" అన్నారు. సూర్యం ఆశ్చర్యపోయాడు

"ఎందుకూ ?" అన్నాడు

"ఉండి చేయగలిగింది లేదు—అందుకు."

టీచర్లంతా వెళ్లిపోయారు

సూర్యం మాత్రం ఎదరింటి అరుగుమీద కూచున్నాడు . ఎక్కడో చుట్టిల్లెక్కి కోడి కూసింది. సూర్యానికి మగతగా తూగు వస్తూంది. బోద కొట్టాలపైనుంచి పొగ నిదానంగా లేస్తూంది .. సూర్యాన్ని నిద్ర లోగొంటూంది

'అయ్‌గారూ ! అమ్మయ్యగారి సంగతేమన్నా తెలిసిందా ?" మడివద్ద కెళ్తున్న అనంతాచారి పలకరించి జవాబు రాకపోయేసరికి తన దారిన తాను సాగిపోయాడు తూరుపు తెలతెలవారుతుంటే ఎవరో కుర్రాడు వూపి వూపి నిద్రలేపితేగానీ లేచాడుకాడు సూర్యం

"ఏమిట్రా అనసూయమ్మగారు ."

"చచ్చిపోయారుసార్ ." అన్నాడు కుర్రాడు. సూర్యానికి ఎందుకో స్వగ్రామంలో ఉన్న వాళ్లమ్మ జ్ఞాపకం వచ్చింది.

3

పదిహేను రోజుల తర్వాత బడి కొచ్చారు జగన్నాధంగారు టీచర్లంతా తమ సంతాపం వ్యక్తం చేశారు.

"ఏం చేస్తాం. అది భగవంతుని నిర్ణయం. నా బ్రతుక్కు దీపం అనసూయ. దేవుడు ఆ దీపాన్ని ఆర్పేశాడు నా బ్రతుకు చీకటైపోయింది" అన్నారు జగన్నాధంగారు

"పిల్లాడు ఎలా ఉన్నాడండీ" అన్నాడు సూర్యం.

"బాగానే ఉన్నాడు ... వాణ్ణి పక్కింటివాళ్ళు చూస్తున్నారు" జగన్నాధంగారు అన్నారు.

గుండె ఝల్లుమంది సూర్యానికి. మెరుపు మెరిసినట్లుగా ఒక ఆలోచన రేగింది లల్లో. కానీ బయటికి అనలేకపోయాడు

రోజులు గడుస్తున్నాయి. జగన్నాధంగారు బడికి వస్తున్నారు కానీ ఎవరితోనూ పలకటంలేదు. పాఠం చెప్పటంలేదు రావడం—గంటయ్యేదాకా కూచోవటం—గంట కాగానే ఇంటికి వెళ్లటం—ఇది అతని కార్యక్రమం ....

ఒకరోజు సాయంకాలం టీచర్లంతా షికారు కెళ్లారు. పొద్దుకూకేవరకూ ఏవేవో విషయాలు మాట్లాడుకున్నారు .... పొద్దు గూట్లో ఎడింది. మత్తుగా వెన్నెల కురవటం ప్రారంభించింది. ఇత్తడి బిళ్లలా—లేత పసుపు రంగుతో చంద్రుడు ఆకాశంలో సాగబారాడు. అవ్యక్తానందంలాంటి ఆ వెన్నెల్లో ప్రకృతి ఆనందంతో నిలబడిఉంది. చెట్లులేని ఆ కొండపేరు—బోడికొండ--ఆ కొండ, కొండక్రింద వానకాలంలో తప్ప నీటిపాయ కనిపించని పిల్లయేరు, పిల్లేటి గట్టునుంచీ వూరి పొలిమేరదాకా ఎరుచుకున్న సజ్జచేలు, చేలలో మంచెల మీద నుంచి డబ్బాల శబ్దంతో కలిసి వినిపించే పల్లెపదాలూ—వీటితో కాలక్షేపం చేస్తూ ఎనిమిది గంటలదాకా గడిపారు చాలా పొద్దు పోతుందని యిళ్లకు బయలుదేరారు కొండదిగి పిల్లవంక దాటుతుంటే జగన్నాధంగారు ఎదురయ్యారు

"ఏమిటి మేష్టారూ యిప్పుడు వెళ్తున్నారు ?" ఆశ్చర్యంలో ప్రశ్నించాడు సూర్యం

"ఏంలేదు ఆ ఇసకదిబ్బ లేదూ—అక్కడ నా పుస్తకం మర్చిపోయాను—తెచ్చుకుందామని"

అందరూ తిరిగి వెళ్ళారు పుస్తకం అక్కడే ఉంది అందుకుని చూశాడు సూర్యం. అది 'మెథడ్స్ ఆఫ్ టీచింగ్ ఇంగ్లీషు—" ట్రైనింగు పరీక్ష పుస్తకం ......

రెండోరోజు చిత్తూరునుంచి జగన్నాధంగారికి ఒక పార్శిలు వచ్చింది విప్పిచూసి అందరూ ఆశ్చర్యపోయారు. అందులో ఒక సెట్ ట్రైనింగు పరీక్ష పుస్తకా లున్నాయి

"ఎవరికండీ యివి ?" సూర్యం ప్రశ్నించాడు.

"నాకే!" జగన్నాధంగారికళ్లలో నీళ్లు నిలిచాయి.



పండిత
డి గోపాలాచార్యులవారి
బ్రాహ్మామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

డాక్టర్ వృత్తి చేయుండి!
ఇంటిలో విరామంగా కూర్చొని పుండే వాళ్ళకు పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిస్టర్డు కాలేజీ ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.
వివరములకు వెంటనే వ్రాయండి.
Indian Homoeopathic College
(APW) Jullundur City

జామ్-బక్
శమనపర్చి మాన్పును!
మీరు జామ్-బక్‌ను వాడితే తరువాత మంట తగ్గుతు, ఎందుకనగా, దానిలో ఎన్నబడిన మూలికా అంటువిరోధక ఓషధులు గలవు. చర్మవాపులకు, కలగడ్డ వాపుల నొప్పులకు, లోక ప్రసిద్ధమయిన జామ్-బక్‌ను వాడండి. ఆయింట్‌మెంటు జామ్-బక్‌తో మీకు తక్షణ శమనము గలుగును. దీనిలో అంతు క్రొవ్వులు మూనెలు లేవని గ్యారంటీ చేయబడినది
Zam-Buk
జామ్-బక్
మూలికా బామ్

(ఇది మందుల వ్యాపారు లందరివద్దను దొరుకును.
సి. ఇ. ఫల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి.
సోల్ ఏజంట్లు. దాదా & కంపెనీ,
86, నైనప్పనాయక వీధి, మద్రాసు-3

కోరిక తీరినవేళ

"ఎందుకండీ అలా "

"అనసూయ చనిపోయేటప్పుడు ఒకే కోరిక కోరింది .... "

"ఏమని—పరీక్షకు కూచోమనా ?"

అవునన్నట్లు తలూపారు జగన్నాధంగారు.

"అలాగైతే పరీక్ష కూచుంటున్నారా ?"

"అందుకేగా పుస్తకాలు. మార్చి పరీక్షకు మొన్ననే డబ్బు కూడా కట్టేశాను ఇక శ్రద్ధగా చదవాలి"

టీచర్లంతా ఆశ్చర్యంతో తలమునకలైపోయారు జగన్నాధంగారికి యిక ఉన్న సర్వీసు మహా అంటే నాలుగేళ్ళు. పరీక్ష పాసయిన తర్వాత ఎప్పుడో ఖాళీలు వస్తే హెడ్మాస్టరు ఉద్యోగం! వారు హెడ్మాస్టరైనా జీతంలో పెద్ద భేదం కనిపించదు! అసలు అనసూయమ్మ చనిపోయిన తర్వాత జగన్నాధంగారు మనిషే కాదనుకుంటే యీనాడు వారు పరీక్షకు చదువుకుంటున్నారు. వారికి పిల్లాడి కన్నా పరీక్షే ఎక్కువైపోయింది .... కాస్సేపు తర్వాత జగన్నాధంగారే అన్నారు

"నీకు తెలుసుగా సూర్యం—అనసూయ నన్నే నాడూ యేమీ కోరలేదు. కానీ చనిపోయేముందు . నన్ను పరీక్ష పాసై .. హెడ్మాస్టరుగా రిటైరు కమ్మని కళ్ళల్లో నీళ్ళుంచుకుని మాట్లాడలేక మాట్లాడలేక ప్రార్థించింది. ఇదేమంత పెద్ద కోరిక కాదుగా. అదికూడా ఎందుకు తీర్చకుండా పోవాలి . . .. "

జగన్నాధంగారు వెళ్ళిపోయాక టీచర్ల మధ్య చర్చ పుంజుకుంది

"సార్! మీరేమైనా అనండి—జగన్నాధంగారు పట్టుదల మనిషి"

"పట్టుదలా .... పిండాకూడూ . . జగన్నాధంగారి కొడుకు లేడటండీ . ఐదేళ్ళవాడు—వాడు దిక్కులేని పిల్లాడిలా అక్కడా యిక్కడా తింటూ తిరుగుతూ పెరుగుతుంటే ఈ మనిషి పరీక్షలకు కూచుంటున్నాడు"

"ఇదంతా చూస్తే నాకే ... " ఏదో అనబోయిన సూర్యం అర్థోక్తిలోనే ఆగిపోయాడు.

* * *

పుస్తకాలు వచ్చినప్పటినుంచీ జగన్నాధంగారికి అహోరాత్రాలు చదవటానికే చాలడంలేదు వంట, భోజనం, పిల్లాడు అన్నిటిమీదా అశ్రద్ధ ఎక్కువైపోయింది. పిల్లాణ్ణి యిరుగూ పొరుగూ చూసుకుంటున్నారు... ఇలా సరైన తిండీ, విశ్రాంతి లేక జగన్నాధంగారి ఆరోగ్యం బాగా దెబ్బతినిపోయింది. జ్వరం నాలుగు రోజులు కాసి టైఫాయిడ్‌గా మారింది. సూర్యం జాగ్రత్తగా మందు మాకు చూసుకునేవాడు. జగన్నాధంగారు మాత్రం అంత జ్వరంలోనూ పడకమీదే చదువు సాగించేవాడు. సూర్యానికి ఒకరోజు కోపంవచ్చి పుస్తకాలు లాగి పారేయబోయాడు.

"మరిచిపోకు సూర్యం ... ఇది నా భార్య జీవితాని కంతా కోరిక. ఒకే కోరిక" అన్నారు జగన్నాధంగారు కళ్ళనిండా నీళ్ళుంచుకొని . . సూర్యానికి కూడా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

రోజురోజుకూ జగన్నాధంగారి ఆరోగ్యం క్షీణించిపోతోంది. వేస్తున్న మందులూ మాకులూ ఏవుతున్నాయో అర్థం కావటంలేదు. ఊళ్ళో ఉన్న డాక్టరు చిత్తూరికి తీసుకెళ్ళా లన్నాడు. జగన్నాధంగారు మొండికేసుకున్నారు. సూర్యం, ఇతర టీచర్లూ ఆశలు వదులుకున్నారు. డాక్టరు కూడా మందివ్వటం చాలించుకున్నాడు.

.. కానీ జగన్నాధంగారి ఆయుస్సు గట్టిది. ఏవో నాటుమందులవల్ల పది రోజుల్లో కోలుకున్నారు.

"అయ్యోరామ! ఆయ నెక్కడ చనిపోతాడండీ—పరీక్ష పాసయ్యేదాకా!" అన్నాడు లెక్కల టీచరు వెంకటరామయ్య . . సూర్యం మనసులో ఆ మాట ముల్లులా గుచ్చుకుంది

జగన్నాధంగారి ఆరోగ్యం కుదటపడిన తర్వాత పదిహేను రోజులు సెలవు పెట్టారు. తిండీ నిద్ర వదిలి చదివి పరీక్షలు రాసి వచ్చారు.

"ఎలా రాశారండీ ?" అన్నాడు సూర్యం

"బాగా రాయలేదు సూర్యం .... పాసుకావడం సందేహమేలాగుంది"

ఆ సంగతి సూర్యానికి ముందే తెలుసు

ఎనిమిదో తరగతి పరీక్షలు జరిగాయి. మరి కొన్నాళ్లకు వేసవి సెలవులు వచ్చాయి. వాటి కోసం పది నెలలనుంచీ ఎదురుచూస్తున్న టీచర్లు కొత్తగా రెక్కలొచ్చిన పిట్టల్లా పారిపోయి మళ్ళీ బడి తెరిచేరోజు వాలారు మళ్ళీ బడి ప్రారంభమైంది.

ఒకరోజు ఉదయం లేచి పేపరు చూస్తున్న సూర్యానికి ట్రైనింగు పరీక్షల ఫలితాలు కనిపించాయి జగన్నాధంగారి నంబరు చూశాడు జగన్నాధంగారు ఫస్ట్‌క్లాస్‌లో పాసయారు. ఎగిరి గంతేసి పేపరు అలాగే తీసుకుని జగన్నాధంగారింటికి బయలుదేరాడు సూర్యం ఇంటిముందు జగన్నాధంగారి అబ్బాయి ఆడుకుంటున్నాడు చింకి జుట్టూ, చిరుగుల చొక్కాతో ఎముకల గూడులా ఉన్న ఆ పిల్లాణ్ణి చూడలేకపోయాడు సూర్యం. వాణ్ణి చేతుల్లోకి తీసుకుని ఇంట్లో కెళ్ళాడు. జగన్నాధంగారు గోడవైపుకు తిరిగి కూచుని ఉన్నారు. వారి చేతుల్లో పేపరుంది.

"సార్! మీరు ఫస్ట్ .... ఫస్ట్ క్లాసులో పాసయారు .. మీరు కాకపోతే మరెవడండీ పాసయే మొనగాడు" ఉత్సాహంకొద్దీ సూర్యం అరిచాడు.

" . ... "

"సార్! మీరేమో పాసే కాసన్నారు. చూశారా ఫస్ట్ .. ఫస్ట్‌క్లాసులో .... .. " భుజంమీద చెయ్యేసి ఊపుతూ అన్నాడు సూర్యం. జగన్నాధంగారి చేతుల్లోని పేపరు నేలమీదికి జారింది తల ముందుకు వాలి—వేళ్లాడింది.

సూర్యం వంగిచూశాడు ... ఒక్కసారిగా గుండె జలదరించింది. ఏనాడో లెక్కల టీచరు అన్న మాట మనస్సులో మిన్నాగులా కదిలింది. మళ్ళీ చూశాడు సూర్యం. జగన్నాధంగారి పెదవులమీద యింకా చెరిగిపోని తృప్తి మాత్రమే కనబడింది. సూర్యం భారంగా నడుస్తూ ఇల్లు చేరాడు ఇంటికొచ్చేదాకా తన చేతుల్లో కుర్రాడున్నాడన్న సంగతి సూర్యానికి జ్ఞాపకమే లేదు. గట్టిగా తన హృదయానికి అదుముకున్నాడు. ★